క్లుప్తంగా

ఎస్టీపీ సెంటర్ సందర్శన

ఆరిలోవ: బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ శనివారం ఆదర్శనగర్‌లోని ఎస్టీపీ సెంటర్‌ను సందర్శించారు. దీని భవనంపై అదనపు అంతస్తు నిర్మించడానికి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ సంక్షేమ శాఖ ద్వారా కాపు, బీసీ, ఈడబ్ల్యూఎస్ కులాలకు చెందిన మహిళలకు స్వయం ఉపాధి పొందే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా మహిళలు భవిష్యత్‌లో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదిగే అవకాశం కలుగుతుందన్నారు.

20వ వార్డులో చెత్త తొలగింపు



పేరుకుపోయిన చెత్తను తరలిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20వ వార్డులో పేరుకుపోయిన చెత్త తొలగింపులో పారిశుధ్య కార్మికులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ సమస్యపై శనివారం 'చెత్త'శుద్ధి ఏది..? అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి జీవీఎంసీ సిబ్బంది స్పందించారు. వార్డులోని రోడ్లపై, గెడ్డల్లో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను సేకరించి జీవీఎంసీ వాహనాల ద్వారా తరలించారు. దీంతో వార్డు మొత్తం శుభ్రంగా మారింది. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

శివాజీ పార్క్‌లో ముగిసిన యోగా శిక్షణ

ఎంవీపీకాలనీ: ఎస్ యోగా, కృష్ణార్జున యోగా, శివాజీ పార్క్ గొడుగు వాకర్స్ అసోసియేషన్ సంయుక్తంగా శివాజీ పార్క్‌లో నిర్వహించిన ఉచిత యోగా శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఈ నెల 15 నుంచి 19 వరకు ఇక్కడ కీళ్ల నొప్పుల నివారణకు యోగా పద్ధతులు, ఆసనాలపై శిక్షణ అందించారు. 50 మంది వరకు పాల్గొని ఆయా పద్ధతులను అభ్యసించారు. ముగింపు కార్యక్రమంలో అతిథులు వాకర్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ద్వారకానాథ్, ఎలక్ట్ గవర్నర్ మహేష్ తదితరులు యోగా శిక్షకులను సత్కరించారు. గొడుగు వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.


ఫుట్‌పాత్‌పై వెల్డింగ్ పనులకు అడ్డుకట్ట



సంజయ్‌గాంధీ కాలనీలో ఫుట్‌పాత్‌పై వెల్డింగ్ సామగ్రి, గేట్లు తొలగిస్తున్న శానిటరీ సిబ్బంది

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు సంజయ్‌గాంధీ కాలనీలో రహదారి పక్కన ఫుట్‌పాత్‌పై నిర్వహిస్తున్న వెల్డింగ్ షాపు సామగ్రిని శనివారం శానిటరీ సిబ్బంది తొలగించారు. ఇక్కడ రోడ్డు పక్కన ఓ వ్యక్తి గ్యాస్ వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆ షాపు ముందు ఫుట్‌పాత్‌పై వెల్డింగ్ పనులు చేస్తూ మేకులు, కట్‌చేసిన ఇనుప ముక్కలను తొలగించకుండా వదిలేస్తున్నాడు. దీంతో ఆ దారిన వెళ్లేవారు, ఫుట్‌పాత్‌పై నడిచేవారికి మేకులు గుచ్చుకొని గాయాలవుతున్నాయని స్థానికులు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. శానిటరీ సిబ్బంది అక్కడ వెల్డింగ్ పనులు చేయకుండా నియంత్రించారు. ఫుట్‌పాత్‌పై వెల్డింగ్ సామగ్రి, గేట్లు తొలగించారు. షాపు బయట పనిచేయవద్దంటూ నిర్వాహకుడికి హెచ్చరించారు.

వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో విభాగాల పరిశీలన



సిబ్బందికి సూచనలిస్తున్న వీఎంఆర్‌డీఏ కార్యదర్శి మురళీకృష్ణ

మహారాణిపేట: సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఏప్రిల్ థీమ్ ఈ-వ్యర్థాల సేకరణ, రీ-సైక్లింగ్‌కు అనుగుణంగా కార్యాలయంలోని పలు విభాగాల్లో గల పరికరాలను వీఎంఆర్‌డీఏ కార్యదర్శి మురళీకృష్ణ పరిశీలించారు. పనిచేయని కంప్యూటర్లు, కీబోర్డులు తదితర ఈ-వేస్ట్ ఉంటే ఐటీ వర్గాలకు అందించాలని సూచించారు. ఉద్యోగులు తాము పనిచేసే పరిసరాలు నూరు శాతం శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం కైలాసగిరిపై వీఎంఆర్‌డీఏ నిర్వహిస్తున్న విశాఖ దర్శన్ టాయ్ ట్రైన్ మళ్లీ మూలకు చేరింది. ఈ సర్క్యూట్ ట్రైన్ మరమ్మతులకు గురవడంతో నెల రోజులుగా పట్టాలెక్కకుండా నిలిచిపోయింది. అధికారులు పట్టించుకోకపోవడంతో సందర్శకులకు ఎంతో వినోదం అందించే ఈ ట్రైన్‌కు ఎప్పుడు మోక్షం కలుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

కైలాసగిరిపై కదలని రైలుబండి



కైలాసగిరిపై పట్టాలు తప్పి నిలచిపోయిన విశాఖ దర్శన్ టాయ్ ట్రైన్, (ఇన్‌సెట్) విరిగిన ట్రైన్ చక్రాలు

- నెల రోజులుగా పట్టాలెక్కని విశాఖ దర్శన్ ట్రైన్
- గిరిపై సందర్శకులకు వినోదం కరవు
- వేసవి కావడంతో మరింత పెరిగిన పర్యాటకుల రద్దీ
- టాయ్ ట్రైన్ నిలిచిపోవడంతో ఆదాయానికి గండి
- పట్టించుకోని వీఎంఆర్‌డీఏ అధికారులు

ఆరిలోవ:

కైలాసగిరిపై రెండు నెలల కిందట టాయ్ ట్రైన్‌లో ఇంజిన్ భాగాలు పాడవడం, జనరేటర్, లోపల ఏసీ, ఫ్యాన్‌లు పనిచేయకపోవడంతో నిలిపేశారు. దానికి తూతూ మంత్రంగా మరమ్మతులు చేసేసి మూడు వారాల తర్వాత కొండపై పునఃప్రారంభించారు. కొద్ది రోజుల్లోనే రైలుబండి మళ్లీ మొరాయించింది.

చక్రాలు విరిగి.. పట్టాలు తప్పి..

గత నెల 17న కైలాసగిరిపై సందర్శకులను తిప్పుతుండగా.. ట్రైన్ చక్రాలు విరిగిపోయి పట్టాలు తప్పి తెలుగు మ్యూజియం ఎదురుగా నిలిచిపోయింది. నెల రోజులు గడుస్తున్నా వీఎంఆర్‌డీఏ అధికారులు దీన్ని పట్టించుకోలేదు. కైలాసగిరిపై పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు హడావిడి చేస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఇక్కడ పర్యాటకుల వినోదం కోసం తిప్పుతున్న టాయ్ ట్రైన్‌ను పట్టించుకోకుండా మూలన వదిలేయడం విశేషం.

ఆదాయానికి గండి..

సందర్శకులను ఎంతగానో ఆకట్టుకునే విశాఖ దర్శన్ టాయ్ ట్రైన్ నిలిచిపోవడంతో వీఎంఆర్‌డీఏకు రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. సాధారణంగా కైలాసగిరికి వేసవి తాకిడి పెరుగుతుంది.



కైలాసగిరిపై సందర్శకుల సందడి

కార్తీక మాసంతోపాటు వేసవి ఏప్రిల్, మే నెలల్లో ఎక్కువ మంది సందర్శిస్తుంటారు. ప్రస్తుతం పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షలు పూర్తవడంతో వారం రోజులుగా ఇక్కడ రద్దీ పెరుగుతోంది. మిగిలిన తరగతుల విద్యార్థులకు కూడా ఒకటి, రెండు రోజుల్లో పరీక్షలు ముగియనుండటంతో రోజూ ఇక్కడికి వచ్చే సందర్శకుల సంఖ్య మరింత పెరగనుంది. వీరితోపాటు నగరానికి వచ్చిన విదేశీయులు, ఇతర ప్రాంతాల వారు ఎక్కువగా కైలాసగిరిని సందర్శిస్తుంటారు. వీరిని ఈ టాయ్ ట్రైన్ అలరిస్తుండేది. దీనిలో ఎక్కి కొండపై నుంచి విశాఖ నగర అందాలను తిలకించి ఎంజాయ్ చేసేవారు. వారి వల్ల వీఎంఆర్‌డీఏకి నెలకు రూ.లక్షల్లో ఆదాయం చేకూరుతుండేది. గతంలో ఓ ప్రైవేట్ వ్యక్తి దీన్ని నిర్వహించినప్పుడే నెలకు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలకు పైగా లీజు రూపంలో ఆదాయం లభించేది. ఇప్పుడు సుమారు ఒకటిన్నర ఏళ్ల నుంచి వీఎంఆర్‌డీఏ సొంతంగా టాయ్ ట్రైన్‌ను నడుపుతుండటంతో నెలకు రూ.10 లక్షల వరకు వస్తుండేది. ఇంత ఆదాయం తెచ్చిపెడుతున్న టాయ్ ట్రైన్‌పై వీఎంఆర్‌డీఏ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

తరచూ మొరాయింపు..

కైలాసగిరిపై టాయ్ ట్రైన్ తరచూ మొరాయిస్తూ మూలకు చేరుతోంది. దీంతో ఇక్కడికి వస్తున్న సందర్శకులకు నిరాశ ఎదురవుతోంది. వినోదం కరువైందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల వ్యవధిలో రెండు సార్లు ట్రైన్ మరమ్మతులకు గురైంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో మొరాయించడంతో మరమ్మతులు చేపట్టి పునఃప్రారంభించగా.. మార్చి 17న పట్టాలు తప్పి మధ్యలోనే నిలిచిపోయింది. నాటి నుంచి నేటి వరకు పట్టాలపై దిష్టిబొమ్మగా నిలిచిపోయింది. ఈసారి పూర్తిగా దాని చక్రాలు అరిగిపోయాయి. నెల రోజులైనప్పటికీ మోక్షం కలగలేదు. ట్రైన్ స్టేషన్‌లో జనరేటర్, ఫ్యాన్‌లు, ఏసీ పనిచేయడం లేదంటూ బోర్డుపై రాసి పెట్టేశారు. వీఎంఆర్‌డీఏ చైర్మన్, అధికారులు టాయ్ ట్రైన్‌కు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలని సందర్శకులు కోరుతున్నారు.

ఇవీ ట్రైన్ విశేషాలు

వీఎంఆర్‌డీఏకి విశాఖ దర్శన్ టాయ్ ట్రైన్ ద్వారా ఆదాయం చేకూరుతోంది. దీనిలో మూడు బోగీలున్నాయి. ఒకటి ఏసీ, మిగిలిన రెండూ నాన్ ఏసీ బోగీలు. ఏసీ బోగీలో పెద్దలకు రూ.170, పిల్లలకు(4 నుంచి 8 ఏళ్లు) రూ.120, నాన్ ఏసీ బోగీల్లో పెద్దలకు రూ.120, పిల్లలకు రూ.100 టిక్కెట్ ధరలు నిర్ణయించారు. ఇది ఒకసారి కొండపై చుట్టూ తిరగడానికి అరగంట పడుతుంది. సందర్శకుల ఆసక్తిని బట్టి రోజులో 6, 7 సార్లు తిరుగుతుంటుంది. ఈ వేసవిలో పర్యాటకులు, ఆటవిడుపు కోసం వెళ్లే వారితో నిత్యం కైలాసగిరి రద్దీగా ఉంటోంది. వారి నుంచి ఈ సీజన్‌లో ఒక్కో రోజు ట్రైన్ ఆదాయం లక్ష రూపాయలు కూడా దాటుతున్నట్లు సమాచారం.

యాదవ జాతినే తాకట్టు పెట్టిన ద్రోహులు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు

బీచ్‌రోడ్డు: విశాఖలో యాదవులు అధికారం కోల్పోవడంలో ప్రముఖ పాత్ర వహించిన యాదవ సామాజిక వర్గ ఎమ్మెల్యేలు ఆ జాతికే ద్రోహులుగా మిగిలిపోతారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు శనివారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. యాదవ మేయర్‌ను పదవిలో నుంచి దించడం కోసం యాదవ జాతినే తాకట్టు పెట్టిన ఊసరవెల్లిలు ఆ ఎమ్మెల్యేలని ఎద్దేవా చేశారు. జాతి పేరు చెప్పి ఎన్నికల్లో టికెట్లు తెచ్చుకుని, గెలిచాక జాతిని పట్టించుకోకుండా తమ సొంత ప్రయోజనాల కోసం వారికి ద్రోహం చేశారన్నారు. ఇది ఒక గెలుపేనా అని ప్రశ్నించారు. డబ్బులు ఎర చూపి, కుటుంబంలో చిచ్చులు పెట్టి, నీచమైన రాజకీయాలు చేసి గెలవడం గొప్పకాదన్నారు. కూటమి ప్రభుత్వానికి దమ్ముంటే స్థానిక సంస్థ ఎన్నికలను కాలపరిమితి అయిన వెంటనే నిర్వహించాలని దుర్గారావు సవాల్ విసిరారు.

'బి హైగ్రేడ్' కూచిపూడి నృత్యకారిణిగా లిపికారెడ్డి



బీచ్‌రోడ్డు: హైదరాబాద్ దూరదర్శన్ కేంద్రం ఇటీవల కూచిపూడి నృత్య కళాకారులకు ఆడిషన్స్ నిర్వహించింది. ఇందులో విశాఖ నగరానికి చెందిన కె.పి.లిపికారెడ్డి కూచిపూడి నృత్య విభాగంలో 'బి హైగ్రేడ్ కళాకారిణి'గా ఎంపికైంది. ఈ సందర్భంగా విశాఖ ఎంపీ శ్రీభరత్ హర్షం వ్యక్తం చేసి, ఆమెకు అభినందనలు తెలిపారు. లిపికారెడ్డి ఇప్పటి వరకు దేశ విదేశాల్లో 2,000కు పైగా నాట్య ప్రదర్శలు చేసి.. జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో 150కు పైగా పురస్కారాలు, సత్కారాలు పొందారు. ఈమె ఇప్పటి వరకు దేశంలోని 300కు పైగా ప్రముఖ దేవాలయల్లో కూచిపూడి నాట్య ప్రదర్శనలు చేశారు. లిపికారెడ్డి తలపెట్టిన అష్టోత్తర శత నృత్య సంగీతార్చన పేరిట దేశంలోని 108 శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానాల్లో నృత్య సంగీత ప్రదర్శనలో భాగంగా ఇప్పటి వరకు 38 ప్రదర్శనలు పూర్తి చేశారు.

అంతటా స్వచ్ఛత.. అందరి బాధ్యత



విమ్స్‌లో సిబ్బంది చేత ప్రమాణం చేయిస్తున్న డైరెక్టర్ డాక్టర్ రాంబాబు



ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఈ-వ్యర్థాలను తొలగిస్తున్న ఈడీ, ఉద్యోగులు



ఆరిలోవ అంగన్‌వాడీ కేంద్రం వద్ద లబ్ధిదారుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న కార్యకర్తలు



మలేరియా సబ్ యూనిట్ కార్యాలయ ఆవరణను శుభ్రం చేస్తున్న సిబ్బంది



ఏయూ ఆర్ట్స్ కాలేజీ పరిసరాలను శుభ్రం చేస్తున్న రిజిస్ట్రార్ ధనుంజయరావు



ఏయూ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో చెత్త సేకరించిన అధ్యాపకులు, విద్యార్థులు

ఆరిలోవ: ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా నియోజకవర్గంలో పలు చోట్ల స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టారు. హనుమంతవాక వద్ద విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) కార్యాలయంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించి, కంప్యూటర్లు, విద్యుత్ మీటర్లు, మోటార్లు, ఫ్యాన్‌లు, సర్జరీలు చేసే యంత్రాలను శుభ్రం చేశారు. అనంతరం విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ పాడైన ఎలక్ట్రానిక్ పరికరాలు విషపూరితమైనవని, వాటిని ఎక్కడపడితే అక్కడ వేయకూడదన్నారు. వాటిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్ పరికరాల ఉపయోగాలు, నష్టాల గురించి వీడియో ప్రదర్శించారు. సిబ్బంది చేత డైరెక్టర్ రాంబాబు స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.

- చినగదిలి సెక్టార్‌లోని అంగన్‌వాడీ సెంటర్లలో ఈ-వ్యర్థాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఆరిలోవ నెహ్రూనగర్(రాజేంద్రనగర్)లోని అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తలు అన్నపూర్ణ, కామేశ్వరి లబ్ధిదారుల చేత ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించి రీసైక్లింగ్‌కు వినియోగిస్తామని, పరిసరాలను శుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేయించారు.

మలేరియా సబ్ యూనిట్ కార్యాలయంలో..

మద్దిలపాలెం: స్థానిక పిఠాపురం కాలనీలోని మలేరియా సబ్ యూనిట్ కార్యాలయంలో సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యాలయంలోని ఎలక్ట్రానిక్ వ్యర్థాలను నిర్మూలించారు. కార్యాలయంలోని టేబుళ్లు, ఫ్లోర్ శుభ్రం చేశారు. ఆవరణలోని పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్వచ్ఛ ఆఫీస్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో..

ఎంవీపీకాలనీ: స్థానిక జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఈడీ సత్యపద్మ సిబ్బందితో కలిసి ఈ-వ్యర్థాలను తొలగించారు. కొంతకాలంగా నిరుపయోగంగా ఉన్న ఈ-వ్యర్థాలను పోగుజేసి కార్యాలయాన్ని శుభ్రం చేశారు. ఈడీ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, కాలుష్యాన్ని నివారించడంలో అందరూ భాగస్వాములుగా నిలవాలన్నారు. కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నిత్య జీవితంలో స్వచ్ఛత భాగం

మహారాణిపేట: నిత్య జీవితంలో స్వచ్ఛతను ఒక అలవాటుగా చేసుకోవాలని, అప్పుడే మార్పు సాధ్యపడుతుందని ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు అన్నారు. ఏయూ విద్యా విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఆయన ఆర్ట్స్ కళాశాల పరిసరాల్లోని వ్యర్థాలను తొలగించారు. భవిష్యత్ అధ్యాపకులుగా మారే విద్యార్థులంతా పాఠశాల స్థాయి నుంచి చిన్నారులకు స్వచ్ఛత ప్రాధాన్యాన్ని వివరించాలని రిజిస్ట్రార్ సూచించారు. విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు మాట్లాడుతూ విద్యా విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ క్యాంపస్ కార్యక్రమాన్ని నిరంతర ప్రక్రియగా చేపడుతున్నామన్నారు. దీనికి ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సంపూర్ణ సహకారాన్ని అందిస్తున్నారన్నారు. డాక్టర్ ఆలీ, డాక్టర్ రాము, డాక్టర్ వీణాదేవి, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

- ఏయూ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గ్రంథాలయం పరిసరాలను వలంటీర్లు, వివిధ విభాగాల విద్యార్థులతో కలిసి ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు శుభ్రం చేశారు. పరిసరాల శుభ్రతను పాటించడం అలవాటు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ మాట్లాడుతూ చెత్త వెయ్యకండి-స్వచ్ఛతకు తోడ్పడండి అనే నినాదంతో వలంటీర్లు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. పొలిటికల్స్ విభాగాధిపతి ఆచార్య పేటేటి ప్రేమానందం, ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో కార్యాలయంలో..

మహారాణిపేట: రేసపువానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో శుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ప్రోగ్రాం అధికారులు, సిబ్బంది చేత సచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ-వేస్ట్, టేబుళ్లు, కంప్యూటర్లు, రికార్డులు, విండో డోర్లు, పనికిరాని వస్తువులను విభజించి, వాటిని జీవీఎంసీకి పంపించే ఏరాట్లు చేశారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి సంరక్షించాలని డీఎంహెచ్‌వో సూచించారు. జగదీశ్వరరావు, ప్రోగ్రాం అధికారులు, సిబ్బంది తమ సెక్షన్లు, పరిసరాలను శుభ్రం చేశారు.



కార్యాలయంలో ఈ-వ్యర్థాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మజ్జిగ పంపిణీ కియోస్క్ ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న క్రెడాయ్ సభ్యులు

బీచ్‌రోడ్డు: వేసవి ఉష్ణోగ్రతలు ఉధృతంగా ఉన్న నేపథ్యంలో నగర ప్రజలకు తాత్కాలిక ఉపశమనం కల్పించే ఉద్దేశంతో క్రెడాయ్ మహిళా విభాగం మరో మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని చైర్మన్ వి.ధర్మేందర్ తెలిపారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా విశాఖపట్నం లయన్స్ క్లబ్ సహకారంతో రాంనగర్‌లోని లయన్స్ క్లబ్ కమ్యూనిటీ హాల్ ఎదుట శనివారం మజ్జిగ పంపిణీ కియోస్క్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి వేడి తాళలేక ఇబ్బంది పడుతున్న ప్రజలకు మజ్జిగ పంపిణీ ద్వారా తాత్కాలిక ఉపశమనం కల్పించాలన్న సంకల్పం అభినందనీయమన్నారు. సమాజానికి సహాయ పడే ప్రతి చిన్న ప్రయత్నం గొప్పదేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్రెడాయ్ మహిళా విభాగం సమన్వయకర్త ఎస్.భారతి, కార్యదర్శి డి.ప్రణతి తదితరులు పాల్గొన్నారు.

ఏయూ రోప్ స్కిప్పింగ్ మహిళా జట్టు ఎంపిక



మహిళా జట్టుతో ఏయూ వ్యాయామ విద్యా విభాగాధిపతి పల్లవి

మహారాణిపేట: ఆంధ్రా యూనివర్సిటీ మహిళా రోప్ స్కిప్పింగ్ జట్టు ఎంపిక శనివారం జరిగింది. ఈ నెల 22 నుంచి 24 వరకు రాజస్థాన్ మాధవ్ యూనివర్సిటీలో ఆల్ ఇండియా యూనివర్సిటీ మహిళల రోప్ స్కిప్పింగ్ పోటీలు జరుగుతాయని ఏయూ వ్యాయామ విద్యా విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి తెలిపారు. జట్టు కోచ్‌గా ఎం.ఉదయ్‌కుమార్ వ్యవహరిస్తారన్నారు. జట్టులో పి.రమ్య, ఎం.ఎస్.మాధవి, ఎల్.వి.లక్ష్మి, సత్య డిగ్రీ కాలేజీ నుంచి ఆల్ ఇండియా ఇంటర్-యూనివర్సిటీ రోప్ స్కిప్పింగ్ పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎన్.విజయమోహన్ అభినందించారు. ఈ పోటీల్లో పతకాలు సాధించి ఏయూకి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

తవ్వి వదిలేశారు..



పిఠాపురం కాలనీలో తవ్వి వదిలేసిన రోడ్డు

బీచ్‌రోడ్డు: యూజీడీ పనుల నిమిత్తం రోడ్డును తవ్వి పూర్తిగా పూడ్చకుండా వదిలేశారు. స్థానికులు ఆ రోడ్డు మీద నడవాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జీవీఎంసీ 22వ వార్డులో యూజీడీ పనులను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల ఏడాదన్నర కాలంగా పనులను సాగదీస్తూ చేస్తున్నారు. ఈక్రమంలో రహదారులను తవ్వి సక్రమంగా పూడ్చకుండా వదిలేస్తున్నారు. పనుల్లో నాణ్యత లేకపోవడంతో వేసిన కాంక్రీట్ కూడా ఊడిపోయి రోడ్లపై గోతులు ఏర్పడుతున్నాయి. యూజీడీ పనులపై అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

సీపీఎం నాయకుడు కృష్ణమూర్తికి నివాళి



కృష్ణమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఆరిలోవ: సీపీఎం నాయకుడు కృష్ణమూర్తి రెండో వర్ధంతిని ఆరిలోవలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు స్థానిక నాయకులతో కలిసి కృష్ణమూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల కోసం పార్టీ చేపట్టిన పోరాటాల్లో కృష్ణమూర్తి ఉత్సాహంగా పాల్గొనేవారని గుర్తుచేశారు. ఆరిలోవలో కొండవాలు, మురికివాడల ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడటంతోపాటు పేదల ఇళ్ల కోసం భూపోరాటాలు చేసి ఆదర్శనీయంగా నిలిచారన్నారు. అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారన్నారు. కృష్ణమూర్తి మరణించిన తర్వాత కూడా భావితరాలకు ఉపయోగపడేలా కళ్లను దానం చేసి, శరీరాన్ని మెడికల్ కళాశాలకు అందజేయడానికి ముందుగా సిద్ధమయ్యారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్, పి.మణి, జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు, నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయం



సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కనకశేఖర్, పితాని ప్రసాద్

ఎంవీపీకాలనీ: స్వాతంత్ర్య సమరయోధుడిగా, ప్రజా నాయకుడిగా ప్రజల సంక్షేమానికి, బీసీల అభ్యున్నతికి సర్దార్ గౌతు లచ్చన్న అందించిన సేవలు చిరస్మరణీయమని ఇరిగేషన్ విభాగం పూర్వ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కొప్పిశెట్టి కనకశేఖర్ అన్నారు. గౌతు లచ్చన్న వర్ధంతి సందర్భంగా శనివారం ఎంవీపీ కాలనీలోని గౌతు లచ్చన్న బీసీ స్టడీ సర్కిల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కనకశేఖర్ మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో ప్రజా సంక్షేమానికి పెద్ద ఎత్తున కృషి చేసి రాజకీయాల్లో తనదైన ముద్రవేశారన్నారు. గౌతు లచ్చన్న స్ఫూర్తితో బడుగు బలహీన వర్గాల యువత ఉన్నత చదువులతోపాటు ఉత్తమ లక్ష్యాలను ఏర్పచుకొని స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్, పి.సూరిబాబు, దీప్తి, స్టడీ సర్కిల్ ఉద్యోగులు జీవన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.